

ట్రాఫిక్ తిప్పలు

పరిగి పట్టణవాసులను ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. రోడ్లపైనే వాహనాలను నిలపడం ఇబ్బందిగా మారింది. 10లో▸



పంట వివరాల నమోదు..

రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలని కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ సూచించారు. 10లో▸




గెలుపే లక్ష్యం

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

పాఠశాలలో పాముల కలకలం



యాలాల: మండలంలోని అక్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో మూడు పాములు కలకలం రేపాయి. బుధవారం ఎప్పటిలాగే స్కూల్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. పాములు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు సర్పాలను కొట్టి చంపారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాలు, చుట్టుపక్కల అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో తరచూ విషపురుగులు వస్తున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

స.హ. చట్టంపై అవగాహన ఉండాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: సమాచార హక్కు చట్టం – 2005పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత తీసుకురావడం, అధికారులు జవాబుదారీగా వ్యవహరించడానికి ఈ చట్టం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా, నిర్ణీత సమయంలో ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, డిప్యూటీ కలెక్టర్లు(ట్రైనీ) చంద్రకిరణ్, పూజ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ యాదగిరి



బాణసంచా దుకాణదారులతో సమావేశమైన కమిషనర్ యాదగిరి

తాండూరు టౌన్: దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుపై విధించిన నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ యాదగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని బాణసంచా దుకాణ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా లైసెన్సు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ఎన్‌ఓసీ పొందాలన్నారు. నివాస ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. ఎక్కడైనా ఒకే చోట అన్ని దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జనావాసాల మధ్య టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌కు ఆరు దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 6 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందన్నారు. జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, హోటల్, రెస్టారెంట్ యజమానులు, వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ యాప్‌పై రైతులకు శిక్షణ

హయత్‌నగర్: వ్యవసాయ పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలని, వ్యవసాయ డిజిటల్ యాప్ వినియోగంపై వారికి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష సూచించారు. బుధవారం హయత్‌నగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయం, చీడపీడల యాజమాన్యంపై అన్నదాతలకు శిక్షణ ఇచ్చారు.

బస్సు కిటకిట..

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఆర్టీసీకి ఫుల్ గిరాకీ



దసరా పండుగ సందర్భంగా పరిగి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ(ఫైల్)

- జిల్లాలోని మూడు డిపోలకు రెండింతల ఆదాయం
- ప్రైవేటు'లో భారీగా బాదుడు

వికారాబాద్: దసరా, బతుకమ్మ పండుగలు ఆర్టీసీకి భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. తెలంగాణలో అతి పెద్ద పండుగ కావడంతో పెద్ద సంఖ్యలో ప్రయాణాలు సాగించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిటకిటలాడాయి. ఏ బస్సు చూసినా వంద శాతం ఆక్యుపెన్సీని మించి నమోదైంది. గత నెల 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. పండుగ రోజు మినహా వారం రోజులు బస్సులు జనంతో నిండిపోయాయి. రద్దీని అంచనా వేసిన అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే రెండింతల ఆదాయం సమకూరింది. మహిళలు సైతం భారీ సంఖ్యలో ప్రయాణం చేశారు. పాఠశాలలు, కళాశాలలకు పది రోజుల పాటు సెలవులు ఉండటంతో ఎక్కువ మంది సొంత ఊర్లకు వెళ్లారు.

మూడు డిపోలకు..

జిల్లాలోని మూడు ఆర్టీసీ డిపోల్లో 200 పైచిలుకు బస్సులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున లక్ష మంది ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేరుస్తాయి. ఇందులో మహిళా ప్రయాణికులే ఎక్కువగా ఉంటున్నారు. వికారాబాద్ డిపో పరిధిలో సాధారణ రోజుల్లో 15 వేల మంది నుంచి 20 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తుంటారు. గడిచిన వారంలో రోజుకు సగటున 65 వేల నుంచి 75 వేల మంది వరకు ప్రయాణం చేశారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటున రూ.4 లక్షల ఆదాయం వచ్చేది. దసరా సందర్భంగా రోజుకు రూ.7 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు (రెండు రోజులు) ఆదాయం వచ్చింది. తాండూరు డిపోలో సాధారణ రోజుల్లో రోజుకు సగటున రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల ఆదాయం వచ్చేది. పండుగ సందర్భంగా రోజుకు రూ.20 లక్షలు దాటింది. పరిగి డిపోలో సగటున రూ.9 లక్షల నుంచి రూ.11 లక్షల లోపు ఆదాయం వచ్చేది. దసరా సందర్భంగా సగటున రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల ఆదాయం వచ్చింది.

ప్రైవేటులో భారీగా..

ప్రయాణికుల అవసరాలను గుర్తించిన ప్రైవేటు వాహనదారులు టికెట్ ధరలు భారీగా పెంచారు. ఆర్టీసీలో సీట్లు దొరక్కపోవడంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ట్యాక్సీల్లో అయితే పైన కూర్చోబెట్టుకుని తరలించారు. చాలా రూట్లలో రెండింతల వసూలు చేశారు. పలువురు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకొని సొంత ఊర్లకు వెళ్లారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

- మొదటి విడత నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు
- ఎలక్షన్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పూర్తి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం నగరం నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న 11 జెడ్పీటీసీ స్థానాలకు, 115 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్వో, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అనంతరం ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ జెడ్పీ సీఈవో సుధీర్, డీపీఓ జయసుధ, ఆర్డీఓ వాసుచంద్ర, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా అధికారులు

నాణ్యమైన శిక్షణ ఇవ్వాలి

అనంతగిరి/మర్పల్లి: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం వికారాబాద్, మర్పల్లి ఏటీసీలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు టెక్నాలజీపై పట్టు సాధించాలని సూచించారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వికారాబాద్ సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్.ఎం.సరూష్, మర్పల్లి తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ జయరామ్, ఏటీసీ ప్రిన్సిపాల్ సుధీర్, ఏటీసీ ఇన్‌చార్జ్ ప్రకాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బిల్లులు చెల్లించాలని హెచ్ఆర్ ప్రతినిధిని కోరుతున్న సబ్ కాంట్రాక్టర్లు

బిల్లుల కోసం సబ్ కాంట్రాక్టర్ల ధర్నా

- నిలిచిన జాతీయ రహదారి పనులు
- రూ.2.48 కోట్లు చెల్లించాలని డిమాండ్

యాలాల: జాతీయ రహదారి పనులు చేపట్టిన సబ్ కాంట్రాక్టర్లు బుధవారం ధర్నాకు దిగారు. తమకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.2.48 కోట్లు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పనులు చేపట్టబోమని తేల్చి చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి చించోళీ వరకు చేపట్టనున్న 167 జాతీయ రహదారి పనులను ముంబైకు చెందిన ఎస్ఎంసీ ప్రాజెక్టు ప్రైవేట లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఇందులో భాగంగా సైట్ కాంట్రాక్టర్ సాన్వర్స్ రేల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్(ఎస్ఆర్‌పీఎల్) పనులను అప్పగించింది. ఐదు నెలలుగా సబ్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. ఈ విషయమై ఇటీవల సంస్థ ప్రతినిధులపై ఒత్తిడి పెంచినా ఫలితం లేకపోయింది. దీంతో ఆగ్రహించిన సబ్ కాంట్రాక్టర్లు బుధవారం సైట్ కాంట్రాక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ హెచ్ఆర్ జీఎంను నిలదీసి, కార్యాలయాన్ని, ల్యాబ్ భవనానికి తాళం వేశారు. ఐదు నెలలుగా కార్మికులతో పాటు టిప్పర్లు, జేసీబీలు, హైడ్రాలు, గ్రావెల్ కాంట్రాక్టర్, మిల్లర్లు తదితరులకు రూ.2.48 కోట్ల పైచిలుకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాగా సైట్ కాంట్రాక్టర్ ఎండీ గురువారం వచ్చి పెండింగ్ బిల్లుల పరిష్కారం విషయంలో చర్చిస్తారని తెలపడంతో శాంతించారు. కాగా పెండింగ్ బిల్లుల అంశంతో జాతీయ రహదారి పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికే అసంపూర్తి పనులు ఉండటంతో వాహనదారులు పడరానీ పాట్లు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయంలో దృష్టి సారించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్!

- అతిథి అధ్యాపకులకు తప్పని తిప్పలు
- జిల్లాలో 42 మంది బోధన
- భారంగా కుటుంబ పోషణ
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు రెగ్యులర్లతో సమానంగా విద్యా బోధన నిర్వహిస్తున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి నేటి వరకు జీతాలు విడుదల కాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలీచాలని జీతాలతో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు చాలీచాలని జీతాలతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పీరియడ్‌కు రూ.390 చొప్పున నెలకు 72 పీరియడ్లు బోధించాల్సి ఉంటుంది. నెలలో 72 పీరియడ్లు చెబితే రూ.28,080 జీతంగా వస్తుంది. రెగ్యులర్ అధ్యాపకులతో పాటు సమానంగా పనిచేస్తున్నా తమకు మాత్రం అరకొర ఇస్తున్నారని, అవీ కూడా సమయానికి విడుదల కావడంలేదని కంట తడి పెట్టుకుంటున్నారు.

అప్పులు చేసి..

గతేడాది డిసెంబర్ నుంచి జీతాలు రాకపోవడంతో కుటుంబపోషణకు అప్పులు చేయక తప్పడం లేదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు రావాల్సిన బకాయిలను చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. బుధవారం మాత్రం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు మూకుమ్మడిగా కళాశాలకు వెళ్లలేదు. డీఐఈఓ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జీతాలు విడుదల చేయించి తమను ఆదుకోవాలని కోరారు. ఇచ్చే వరకు కళాశాలకు వెళ్లేదిలేదని తేల్చిచెప్పారు. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్ ఒక్కరే హాజరై విద్యా బోధన చేశారు.



డీఐఈఓ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

ప్రభుత్వం స్పందించాలి



ఎనిమిది నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించి ఆదుకోవాలి.

– శ్రీనివాస్, అధ్యాపకుడు

దసరా పండగకు రాకపాయె..



దసరా పండగకు జీతాలు వస్తాయని ఎదురుచూశాం. ఇక దీపావళికి కూడా విడుదలయ్యేలా లేవు. దీంతో తాము కళాశాలకు వెళ్లకుండా డీఐఈఓకు విన్నవించాం. ప్రభుత్వం దీపావళి వరకు విడుదలయ్యేలా చూడాలి. లేకపోతే పస్తులు ఉండాల్సిందే.

– గోపీ, అధ్యాపకుడు

నవోదయమే..

- డిసెంబర్ 13న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష
- ఆరో తరగతిలో చేరేందుకు అవకాశం
- సీటు వస్తే భవిష్యత్‌కు బాట
- ముందస్తు ప్రణాళిక అవసరం అంటున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు జవహర్ నవోదయ విద్యాలయాలు దోహదం చేస్తాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఒత్తిడిలేని చదువు, ఆట పాటలతో మానసికోల్లాసం, విద్యా వికాసానికి నవోదయ కేంద్రాలు వేదికలని అంటున్నారు. ప్రవేశ పరీక్షలో పిల్లలు విజయం సాధించాలంటే తల్లిదండ్రులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సి ఉంటుందని వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

6వ తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13వ తేదీ శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా వెళ్లాలి. మూడు విభాగాల్లో ఎగ్జామ్ ఉంటుంది. మేధాశక్తి, గణితం, భాషా నైపుణ్యానికి సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. వీటిపై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. ఓసీఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించేందుకు నీలి, నలుపు బాల్ పెన్ మాత్రమే ఉపయోగించాలి. రఫ్ వర్క్ కోసం బుక్‌లెట్‌లోని 16వ పేజీ వినియోగించుకోవాలి. ఒక్కసారి సమాధానం రాసిన తర్వాత మార్చడం, దిద్దడం, కొట్టివేయడం చేయరాదు. ముందుగా తెలిసిన వాటికి సమాధానాలు రాయాలి. ఆ తర్వాత తెలియని వాటి కోసం ఆలోచన చేస్తే మంచిది. మేధాశక్తి పరీక్షలో 40 ప్రశ్నలకు 50 మార్కులు గంట సమయం ఉంటుంది. గణితంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు అరగంట సమయం ఇస్తారు. భాషా నైపుణ్యానికి సంబంధించి 20 ప్రశ్నలకు 25 మార్కులు, అరగంట సమయం కేటాయిస్తారు. రెండు గంటల వ్యవధిలో వంద మార్కులకు మూడు విభాగాల్లో విరామం లేకుండా పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలి.



మోడల్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు(ఫైల్)

మేధాశక్తి విభాగంలో..

మేధాశక్తి విభాగంలో 50 మార్కులకు సంబంధించి బొమ్మలతో ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. సమయస్ఫూర్తితో ఒత్తిడికి గురికాకుండా ఆలోచించి జవాబు రాయాల్సి ఉంటుంది.

గణిత విభాగంలో..

గణిత విభాగంలో 25 మార్కులకు సంబంధించి 5వ తరగతి వరకు ఉన్న అన్ని చాప్టర్లలోని ఒకటి లేదా రెండు ప్రశ్నలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

భాషా నైపుణ్యంలో..

భాష పఠనాసక్తి విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. వాటి ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలను నిశితంగా గుర్తించాలి. ఈ మూడు విభాగాలకు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే నవోదయలో సీటు దక్కే అవకాశం ఉంటుంది. నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు విజేతలుగా నిలిస్తే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్నత ప్రమాణాలతో, సాహసోపేతమైన కృత్యాలు, విలువలు, క్రీడలు, పౌష్టికాహారం తోపాటు ఉచిత విద్య పొందవచ్చు.

అవగాహన కల్పించాలి



నవోదయ పరీక్షపై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. తడబాటుకు గురికాకుండా సమాధానాలు రాయడం అలవాటు చేయాలి. ప్రశ్న పత్రం ఎలా ఉంటుంది.. ఎలా మార్క్ చేయాలి.. సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి వంటి వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. అన్ని ప్రశ్నలకు సమాధానం రాసేలా తర్ఫీదు ఇవ్వాలి. మంచి మార్కులు సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలి. ఎక్కువ మార్కులు వస్తే సీటు గ్యారంటీగా పొందవచ్చు.

– క్రాంతికుమార్, హెచ్ఎం, ప్రాథమిక పాఠశాల, హస్నాబాద్/హస్సేన్‌పూర్

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోండి

- ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్
- తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



రాజాసింగ్‌పై ఫిర్యాదు చేస్తున్న ముస్లిం నాయకులు

తాండూరు టౌన్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కమాల్ అతర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాజాసింగ్ మహ్మద్ ప్రవక్త పట్ల, ముస్లింల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన వ్యాఖ్యలు యావత్ ముస్లింలకు బాధ కలిగించేవిగా ఉన్నాయన్నారు. అంతే కాకుండా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పట్టణ సీఐ సంతోష్ కుమార్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాసిత్ అలీ, అబ్దుల్ సలీం, అబ్దుల్ ఖవి, అబ్దుల్ అహద్, యూనస్, ఖయ్యూమ్ అతర్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు

- ఆరు గ్యారంటీల అమలుపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం ఖాయం
- మార్నింగ్ వాక్‌లో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. యాచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులు పంచారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా సకాలంలో నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ మోసాలు ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయని, అభివృద్ధి, సంక్షేమం కావాలంటే కేసీఆర్ రావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. రెండేళ్ల తర్వాత జరిగే సాధారణ ఎన్నికలకు ప్రస్తుత స్థానిక ఎన్నికలు ప్రీఫైనల్‌గా భావించాలన్నారు. అత్యధిక స్థానాల్లో విజయం సాధించి, ఎంపీపీ, జెడ్పీ పీఠాలను కైవ సం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, యాచారం మాజీ సర్పంచ్ మారోజ్ కళమ్మ, నాయకులు యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.



మహిళలకు కాంగ్రెస్ బాకీ కార్డు అందజేస్తున్న కిషన్‌రెడ్డి

క్లుప్తంగా

ఖర్గేకు పరామర్శ



ఖర్గేను పరామర్శిస్తున్న వీహెచ్, ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను బుధవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కలిశారు. బెంగళూర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను కలిసి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకుని, ప్రజాజీవితంలో క్రియాశీలకంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంత్‌రావు తదితరులు ఉన్నారు.

ఎర్రరాయి ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఎర్రరాయి ట్రాక్టర్

బంట్వారం: అక్రమంగా తరలిస్తున్న ఎర్రరాయి ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బంట్వారం ఎస్ఐ విమల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొర్మామిడి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రరాయి ట్రాక్టర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుకొని.. ఠాణాకు తీసుకు వచ్చి అప్పగించారు. ఈ మేరకు తాము కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు సమాచారం అందించామని ఎస్ఐ చెప్పారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు



సీఐ రాఘవేందర్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సయ్యద్ ఖాజా పాషా

పహాడీషరీఫ్: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖాజా పాషా కోరారు. ఈ మేరకు బుధవారం పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కలిసి మెలసి ఉంటున్న ప్రజల నడుమ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు రాజాసింగ్ యత్నిస్తున్నారన్నారు. ఇప్పటికీ ఎన్నో మార్లు ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు అబ్దుల్ ఖదీర్, మహ్మద్ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గేమింగ్ యాప్‌తో మోసం

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో అమాయకులను మోసం చేస్తున్న ఐదుగురు సైబర్ నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ శోభన్ కుమార్‌తో కలిసి సైబర్ క్రైమ్ డీసీపీ సాయి శ్రీ బుధవారం వివరాలు వెల్లడించారు. నవీన్‌కుమార్, సందీప్ కుమార్, పృథ్వీ రామరాజు, పవన్ వెంకట నాగభరద్వాజ్, రామాంజనేయులు ముఠాగా ఏర్పడి టెలిగ్రాం, వాట్సాప్ గ్రూప్‌లలో డాడ్జ్ బుక్777 అనే నకిలీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్లాట్‌ఫామ్‌లను నిర్వహించేవారు. బాధితులను నుంచే కాజేసే సొమ్మును నిర్వహించేందుకు అవసరమైన బ్యాంక్ ఖాతాల కోసం ఈ ముఠా నకిలీ పేర్లు, చిరునామా, ఆధార్ కార్డులతో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లలో 120కు పైగా బ్యాంక్ అకౌంట్లను తెరిచారు. గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ లాభాలను చూపించి, బాధితుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్మును వసూలు చేసేవారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ లావాదేవీల ఆధారంగా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వివిధ ఖాతాలలో ఉన్న రూ.14 లక్షల సొమ్ముతో పాటు రెండు ల్యాప్‌టాప్‌లు, 30 సెల్‌ఫోన్లు, చెక్ బుక్స్, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ తిప్పలు



మార్కెట్‌కు వెళ్లే దారిలో వాహనాల రద్దీ

పరిగిలో వాహనదారులకు నిత్యం నరకం

- పార్కింగ్ లేకపోవడంతో సమస్య అధికం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో వాహనాలు

పరిగి: ట్రాఫిక్ సమస్య పరిగి పట్టణవాసులను దినదినం వెంటాడుతోంది. రోడ్లపైనే వాహనాలను నిలపడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుంది. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలు నిత్యం ఏదో ఒక పని నిమిత్తం పట్టణ కేంద్రానికి వస్తుంటారు. రోడ్లపైనే వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం, జనాల రద్దీ ఎక్కువ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలో ఉదయం, సాయంత్ర పార్కింగ్ సమస్యలతో వాహనదారులు సతమతమవుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్థానికంగా పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను నిలిపి పనులను చేసుకుంటున్నారు.

బస్టాండ్ నుంచి కొడంగల్ చౌరస్తా..

పట్టణ కేంద్రం నుంచే బీజాపూర్, హైదరాబాద్ జాతీయ రహదారి ఉండటంతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటోంది. రోడ్డు పక్కనే వాహనాలు నిలపడంతో ఇక్కట్లు పడాల్సి వస్తుంది. రోడ్డుపై చిరు వ్యాపారాలతో పరిసరాలన్నీ సందడిగా ఉంటాయి. పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి పనులకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. బహర్‌పేట్‌లో కూడా ఇదే తంతు మొదలవుతుంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌తో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అయినా పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

రెండు రోజులు..

స్థానికంగా శుక్రవారం, శనివారం సంత జరుగుతుంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి రైతులు, వ్యాపారస్తులు వస్తుంటారు. వారాంతపు సంత గంజ్ రోడ్డులోనే జరగడంతో ఆ రెండు రోజులు భారీగా ట్రాఫిక్ జాం అవుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులతో రోడ్లపై ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. మార్కెట్‌లోకి వాహనాలు వెళ్లేందుకు రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో తిప్పలు అధికమవుతున్నాయి.

తీవ్ర ఇబ్బందులు



ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్డుపై నడవాలంటే భయం వేస్తుంది. ప్రధాన కూడలిలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తే సమస్య తగ్గుతుంది. కానీ ఎవరూ ఉండటం లేదు. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి సమస్య సృష్టిస్తున్నారు.

– సురేశ్, వాహనదారుడు, పరిగి

చర్యలు తీసుకోవాలి



నిత్యం పరిగిలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వాహనాలపై చలాన్లు విధిస్తున్నారే తప్పా ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. వాహన రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలి.

– మల్లేశ్, ప్రజా సంఘాల నాయకుడు



ఆంజనేయస్వామి దేవాలయం వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్షేత్రస్థాయి పర్యటన

కుల్కచర్ల: విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులు సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్, గోప్యానాయక్‌తండా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రజిని, ఖలేదాబేగం, స్వప్న బుధవారం తమ విద్యార్థులతో కలిసి సమీపంలోని పంట పొలాలు, దేవాలయాల వద్దకు తీసుకెళ్లి పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థులకు సులభతరంగా పాఠాలు చెప్పడంతో పాటుగా ప్రకృతిను ఆస్వాదించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు చెప్పడంపై ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపురానికి రావడం లేదని..

రెండో భార్యను హత్య చేసిన భర్త



రజిత (ఫైల్)

చేవెళ్ల: కాపురానికి రావడం లేదనే కక్షతో భార్యను కడతేర్చాడో భర్త. మాట్లాడుకునేందుకు తీసుకెళ్లి బండ రాయితో మోది దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఆలూరు అనుబంధ గ్రామమైన వెంకన్నగూడకు చెందిన వానరాసి జంగయ్య బతుకుదెరువు నిమిత్తం రాంచంద్రాపురంలో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలున్నారు. ప్రస్తుతం రాంచంద్రాపురంలో మొదటి భార్యతో కలిసి ఉంటున్నాడు. రెండో భార్య రజిత(30) పటాన్‌చెరులో ఇళ్లలో పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. గత రెండేళ్లుగా వీరి మధ్య మనస్పర్థలు నెలకొనడంతో రజిత దూరంగా ఉంటోంది. కాపురానికి రావాలని ఎన్నిసార్లు మాట్లాడటానికి ప్రయత్నించినా ఆమె నిరాకరించింది. ఎట్టకేలకు తన తల్లి వద్ద మాట్లాడుకుందామని చెప్పిన జంగయ్య ఆమెను తీసుకుని గత సోమవారం రాత్రి వెంకన్నగూడకు వచ్చాడు. మరుసటి రోజు మంగళవారం గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ పెట్టినా భర్తతో ఉండేందుకు రజిత అంగీకరించలేదు. దీంతో కక్ష పెంచుకున్న జంగయ్య అదేరోజు రాత్రి రజితను గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి చున్నీ మెడకు బిగించి, తలపై బండ రాయితో మోది చంపాడు. అనంతరం నేరుగా వెళ్లి పీఎస్‌లో లొంగిపోయాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా హత్యలో మొదటి భార్య ప్రమేయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మహిళా సంఘాలు మెప్మాకు అనుసంధానం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చేవెళ్ల: గ్రామాల్లో ఇన్నాళ్లుగా కొనసాగిన మహిళా సంఘాలు అన్ని మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా పరిధిలో పని చేస్తాయని జిల్లా పీడీ వెంకటనారాయణ తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశం ఆధ్వర్యంలో బుధవారం మహిళా సంఘాల గ్రూప్ రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ వెంకటనారాయణ, డీఎంసీ(డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్) ఇందిరా మాట్లాడుతూ.. మహిళా సంఘాలు అన్ని మున్సిపాలిటీ పరిధిలో ఉండే మెప్మా సంస్థ పరిధిలోకి వస్తాయని చెప్పారు. చేవెళ్ల మున్సిపాలిటీగా ఇటీవలే ఏర్పడటంతో మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలు అన్ని మెప్మాకు అనుసంధానం అయినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, ఉపాధి శిక్షణ, ఆరోగ్య కార్యక్రమాలు, సంయుక్త నిధులు తదితర కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మున్సిపాలిటీలలో మెప్మా సభ్యులకు అందుతాయని వివరించారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల గ్రూప్ రిసోర్స్ పర్సన్‌లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని వేధిస్తున్నాడని యువకుడి దారుణ హత్య



హత్యకు గురైన యాసర్



నిందితుడు ఆయాన్

రాజేంద్రనగర్: తల్లిని వేధిస్తుండటమేగాక తరచూ గొడవ పడుతుండటంతో ఆమె కుమారుడు తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తిని కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూవ్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యాసిర్ (28) ఒక చానల్‌లో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మహిళ(40)తో సహజీవనం చేస్తున్నాడు. మహిళతో పాటు ఆమె నలుగురు సంతానాన్ని తన వద్దే ఉంచుకుని అందరూ కలిసి నివసిస్తున్నారు. గత కొన్నాళ్లుగా సదరు మహిళతో యాసిర్ తరుచూ ఘర్షణ పడుతున్నాడు. బుధవారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న సదరు మహిళ పెద్ద కుమారుడు ఆయాన్ (18) ఆగ్రహం పట్టలేక కత్తితో యాసిర్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. దీనిని గుర్తించిన స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్ ఆటలతో జాగ్రత్త

మోమిన్‌పేట సీఐ వెంకట్

మోమిన్‌పేట: సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనై డబ్బులు ఇన్వెస్ట్ చేయొద్దని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాం మీద రీల్స్ చూస్తూ పెట్టుబడులు పెట్టిన కొందరు మోసపోయారన్నారు. నవాబుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోషల్ మీడియాలో చూసి పెట్టుబడి పెట్టి రూ.6లక్షల పోగొట్టుకున్నాడని చెప్పారు. ఆన్‌లైన్ ప్రకటనలు చూసి నమ్మొద్దని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్ బారిన పడితే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



సంధ్యారాణి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా గుడిపల్లికి చెందిన గజ్జల శ్రీకాంత్ రెడ్డి అతని భార్య సంధ్యారాణి(32) పిల్లలతో కలిసి జీవనోపాధి నిమిత్తం రెండు నెలల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి కర్రీ పాయింట్‌ను నడుపుతున్నారు. ఈ నెల 1వ తేదీన ఎల్లారెడ్డిగూడలోని సోదరుడి ఇంటికి వెళ్లిన సంధ్యారాణి 7వ తేదీన తుక్కుగూడ వచ్చానని పేర్కొని, ఇంటికి మాత్రం వెళ్లలేదు. తిరిగి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆందోళనకు గురైన భర్త ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విద్యుత్ లేక.. తాగునీటికి కటకట

- బొంకూర్‌లో నిలిచిన త్రీ ఫేజ్ కరెంట్
- తీవ్ర అవస్థలు పడుతున్న గ్రామస్తులు



బిజ్వార్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

తాండూరు రూరల్: విద్యుత్ సరఫరా లేక మండల పరిధిలోని బిజ్వార్ అనుబంధ గ్రామమైన బొంకూర్ గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. త్రీ ఫేజ్ కరెంట్ లేకపోవడంతో బోరు మోటార్లు పని చేయడం లేదు. దీంతో పది రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలం రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బొంకూర్ గ్రామానికి విద్యుత్ సరఫరా ఉంది. ఇటీవల కాగ్నా వాగు ఉధృతంగా ప్రవహించడంతో బిజ్వార్ గ్రామంలోని గొల్ల సాయిలు పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో బొంకూర్‌కు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అప్పట్లో విద్యుత్ అధికారులు సింగల్ ఫేజ్ కరెంట్ ఇవ్వడంతో ఇళ్లల్లో మాత్రమే కరెంట్ వచ్చింది. కానీ త్రీ ఫేజ్ కరెంట్ లేకపోవడంతో గ్రామంలో తాగునీటి బోరు మోటార్లు పని చేయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్, రుక్మాపూర్ గ్రామాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు తెలిపారు.

బురదతో పనులకు ఆటంకం

కాగ్నానది ఉధృతంగా ప్రవహించడంతో బొంకూర్‌కు వెళ్లే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ జానీ స్పందించారు. పది రోజుల క్రితం సిబ్బంది కష్టపడి సింగిల్ ఫేజ్ కరెంట్‌ను బొంకూర్‌కు సరఫరా చేసిందన్నారు. అయితే త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలంటే పడిపోయిన స్తంభాల వద్ద కొత్తవి ఏర్పాటు చేయాలి. అక్కడికి వెళ్లాలంటే ఇంకా పొలాల్లో బురద ఉంది. అందుకే ఆలస్యమైతుందని చెప్పారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి త్రీ ఫేజ్ కరెంట్‌ను పునరుద్ధరిస్తామని వివరించారు.

పంటల నమోదు తప్పనిసరి



దుద్యాల్: పంట వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు



కొడంగల్ రూరల్: రుద్రారంలో నానో యూరియాను పిచికారీ చేస్తున్న రైతు

ఏడీఏ శంకర్ రాథోడ్

దుద్యాల్: రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలని కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ సూచించారు. బుధవారం దుద్యాల్, పోలేపల్లి, ఈర్లపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో పండిస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ మాణికేశ్వరి, రైతులు రవినాయక్, సంతోష్ పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలు

కొడంగల్ రూరల్: మండలంలోని రుద్రారంలో బుధవారం గ్రామానికి చెందిన బొందెంపల్లి కిష్టప్ప పొలంలో నానో యూరియాను వ్యవసాయాధికారులు సూచన మేరకు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి తులసి రుద్రారం, అంగడిరాయిచూర్ గ్రామాల్లోని పత్తి పంట పొలాలను పరిశీలిస్తూ నానో యూరియా వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తక్కువ మోతాదుతో ఎక్కువ పోషక ప్రభావం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీపతి రెడ్డి, పావని, రైతులు పాల్గొన్నారు.

ఉపాధినిస్తున్న సీతాఫలం



మెహిదిపట్నంలో సీతాఫలాలు అమ్ముతున్న సాలిండాపూర్ తండాకు చెందిన మహిళ



నగరంలో సీతాఫలాలు విక్రయిస్తున్న బురాన్‌పూర్ తండాకు చెందిన గిరిజన మహిళ

సుదూర ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో విక్రయం

దుద్యాల్: ప్రస్తుత సీజన్‌లో లభించే సీతాఫలం పండ్లను విక్రయించడం ద్వారా గిరిజన మహిళలు ఉపాధి పొందుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని సాలిండాపూర్ తండా, బురాన్‌పూర్ తండాకు చెందిన మహిళలు నిత్యం సీతాఫలం పండ్లను నగరానికి తరలించి విక్రయిస్తున్నారు. ఒక గంప కాయలను రూ.300 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పండ్లు అయితే మంచి ధర వస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్ కావడంతో వారు పండ్ల రవాణాకు ఉపయోగించుకుంటున్నారు. తద్వారా రవాణా ఖర్చులు ఆదా చేస్తున్నారు.

37 మంది బైండోవర్

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 37 మందిని బుధవారం యాచారం తహసీల్దార్ అయ్యప్ప ముందు బైండోవర్ చేసినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. మాల్–8, తక్కళ్లపల్లి–6, చింతుల్ల–8, కొత్తపల్లి–8, నందివనపర్తి–5, గునుగల్–2 మందిని బైండోవర్ చేసినట్లు ఆయన చెప్పారు. ఇంకా 18 గ్రామాల్లో ఉన్న బెల్టు దుకాణాల నిర్వాహకులను కూడా బైండోవర్ చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఏ గ్రామంలో మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పూల సాగు.. లాభాలు బాగు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి
- ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి



కాశీంబౌలిలో బంతి పూల సాగు

మొయినాబాద్‌రూరల్: పుష్పాల సాగు రైతులకు ఆదాయ పరిమళం కురిపిస్తోంది. గతంలో సంప్రదాయ పంటలు సాగు చేసి ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలను చవిచూసిన రైతులు ప్రస్తుతం తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను ఆర్జించేందుకు శ్రీకారం చుడుతున్నారు. ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పూల తోటల సాగుతో అధిక దిగుబడులు సాగించవచ్చని నిరూపిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 1,200 ఎకరాలలో పూల సాగు చేస్తున్నారు. అందులో మొయినాబాద్ మండలంలోనే 300 ఎకరాల్లో పండిస్తున్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, కాశీంబౌలి, బాకారం, వెంకటాపూర్, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, కుతుబుద్దీన్‌గూడ, వీరన్నపేట్, చందానగర్, మోత్కుపల్లి, కనకమామిడి, కంచమోనిగూడ, శ్రీరామ్‌నగర్, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి ఆయా గ్రామాల్లో ఎక్కువగా గులాబీతో పాటు చామంతి, బంతి పూల తోటలు సాగు చేస్తున్నారు. చేవెళ్ల మండలంలోని కందవాడ, పల్గుట్ట, గుండాల, చందన్‌వెల్లి, దేవరంపల్లి గ్రామాల్లో రైతులు సైతం పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్‌లో డిమాండ్

రైతులు పండిస్తున్న బంతి, చామంతి పూలకు శుభకార్యాలు ప్రారంభం కావడంతో పాటు సమీపిస్తున్న దీపావళి పండుగతో గిరాకీ వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బంతి కిలో రూ.50–60, చామంతి రూ.80–100 ధర పలుకుతుందని చెబుతున్నారు.

రూ.40 వేలు లాభం



ఏటా చామంతి సాగు చేస్తున్నాను. దసరా, దీపావళితో పాటు పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో గిరాకీ ఉంది. ఒక ఎకరాకు రూ.60 వేల నుంచి 70 వేల వరకు ఖర్చు అవుతుంది. పెట్టుబడి పోగా దాదాపు రూ.40 వేల వరకు లాభాలు వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పంట కొంత దెబ్బతింది.

– భూపాల్‌రెడ్డి, రైతు

ప్రభుత్వం సహకరించాలి



పూల సాగుకు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నారు ఉచితంగా పంపిణీ చేయాలి. మొక్కలపై సబ్సిడీ ఉండేలా అధికారులకు చర్యలు తీసుకుంటే రైతులకు మేలు చేకూరుతుంది. పూల రైతుల పట్ల సర్కారు అవగాహన కల్పిస్తూ ఆదుకోవాలి.

– సైపాల్‌రెడ్డి, అమ్డాపూర్, రైతు

సబ్సిడీ లేదు

మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలలో అధికంగా పూల సాగు చేస్తారు. భారీ వర్షాలు కురవడంతో ఈ ఏడాది దిగుబడి తగ్గింది. రైతులు సబ్సిడీ నారు కోసం ఆరా తీస్తున్నారు. కానీ పూల సాగుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేదు. కూరగాయాల సాగుకు సబ్సిడీ ఉంది.

– కీర్తి, ఉద్యానవన శాఖ, చేవెళ్ల